

ప్రదక్షిణలతో సరి..

తాము నాటి పెంచిన మామిడి చెట్లను అగ్ర కులస్తులు నేలమట్టం చేశారని యానాదులు కన్నీటి పర్యంతమయ్యారు. - 8లో



కన్నీటి సంద్రమే..

నీటి కుంటలో పడి దుర్మరణం పాలైన ముగ్గురు చిన్నారులకు అశ్రునయనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. - 8లో



పోలీస్ గ్రీవెన్స్‌కు ఫిర్యాదులు

పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి 36 వినతులు అందాయి. - 8లో

న్యూస్‌రీల్

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

- రేపు ప్రసన్న తిరుపతికి గంగమ్మకు పట్టువస్త్రాల సమర్పణ



వర్సిటీ హెలిప్యాడ్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ

కుప్పం: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 21న కుప్పం పర్యటనకు రానున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు ఏర్పాట్లను పరిశీలించారు. సోమవారం ద్రవిడ వర్సిటీలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి కుప్పం వరకు రూట్ మ్యాప్ పరిశీలించారు. శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతరలో విశ్వరూప దర్శనం పురస్కరించుకుని అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు బుధవారం సీఎం కుప్పం వస్తున్నట్లు తెలిపారు. సెక్యూరిటీకి సంబంధించి వర్సిటీ గ్రౌండ్ హెలిప్యాడ్‌లో బ్యారికేడ్లు, శానిటేషన్ నిర్వహణపై అధికారులకు సూచనలు ఇచ్చారు. బుధవారం ఉదయం సీఎం విజయవాడ నుంచి బెంగళూరుకు, అక్కడి నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు ద్రవిడ వర్సిటీ హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి కుప్పం తిరుపతి గంగమ్మ దేవాలయం చేరుకుని అమ్మవారిని దర్శించుకుంటారు.అనంతరం 2.30 గంటలకు విజయవాడకు తిరుగుప్రయాణం అవుతారని అధికారులు చెప్పారు.

రైఫిల్ షూటింగ్‌పై క్యాడెట్లకు శిక్షణ



క్యాడెట్లకు రైఫిల్ షూటింగ్‌లో శిక్షణ ఇస్తున్న ఎన్‌సీసీ అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ అని క్యాంప్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ నోయల్ వివేక్ మోనిస్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పోలీసు మైదానంలో నిర్వహిస్తున్న 10 రోజుల శిక్షణా కార్యక్రమంలో క్యాడెట్లకు రైఫిల్ షూటింగ్‌పై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ, లక్ష్యంపై దృష్టి, శ్వాసపై నియంత్రణ, ఆయుధంపై పట్టు మంచి ఫైరర్‌కు ఉండాల్సిన లక్షణాలు అని అన్నారు. డిప్యూటీ క్యాంప్ కమాండెట్ మేజర్ లోకనాథం మాట్లాడుతూ, ఎన్‌సీసీ శిక్షణ పూర్తి చేసి అందుకునే సర్టిఫికెట్లు క్యాడెట్లకు ఉన్నత విద్య, ఉద్యోగాలను సాధించేందుకు ఉపయోగపడుతాయన్నారు. అనంతరం ఎన్‌సీసీ ఆఫీసర్ ప్రసాద్‌రెడ్డి మాట్లాడారు. రైఫిల్ షూటింగ్, డ్రిల్, సరిహద్దుల్లో ఆర్మీ శిబిరాలు ఏ విధంగా ఉంటాయో క్యాడెట్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు కార్తీక్, చిరంజీవి, ధనంజయులు, యుగంధర్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

తవణంపల్లె రెండో వైస్ ఎంపీపీగా అనసూయమ్మ ఏకగ్రీవం

- ఎన్నికలకు హాజరైన 8 మంది వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు

తవణంపల్లె: తవణంపల్లె మండలం రెండో వైఎస్ ఎంపీపీగా వైఎస్సార్‌సీపీకి చెందిన చెర్లోపల్లె ఎంపీటీసీ సభ్యురాలు అనసూయమ్మ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు మండల ఎన్నికల అధికారి, డీపీఓ సుధాకర్ ప్రకటించారు. తవణంపల్లె రెండో వైస్ ఎంపీపీ పదవి ఖాళీ కావడంతో ఎన్నికల కమిషన్ ఆదేశాలు మేరకు రిటర్నింగ్ అధికారి సుధాకర్ తవణంపల్లె ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 11 గంటలకు ఎన్నికలు నిర్వహించారు. మండలంలో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు సభ్యులు 14 మంది, టీడీపీ ఎంపీటీసీ సభ్యుడు ఒకరు ఉన్నారు. ఇందులో వైఎస్సార్‌సీపీకి చెందిన 8 మంది ఎంపీటీసీ సభ్యులు మాత్రం ఎన్నికల హాల్లోకి హాజరుకాగా మిగిలిన వారు హాజరుకాలేదు. ఎన్నికల నియమావళికి మేరకు కోరం ఉన్నందున ఎంపిక ప్రక్రియ ప్రారంభమైన తర్వాత ఆలస్యంగా వచ్చిన ఇద్దరు ఎంపీటీసీల సభ్యులను రిటర్నింగ్ అధికారి రిజిస్టర్‌లో సంతకం చేయలేదు కాబట్టి వెళ్ళిపోవచ్చని స్పష్టం చేశారు. 8 మంది ఎంపీటీసీల్లో ఒకరు చెర్లోపల్లె ఎంపీటీసీ అనసూయమ్మను మండల రెండో వైస్ ఎంపీపీగా ప్రతిపాదించగా, మరొకరు బలపరచడంతో రిటర్నింగ్ అధికారి సుధాకర్ అనసూయమ్మను రెండో వైస్ ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎంపికైనట్లు ప్రకటించి ధ్రువీకరణ పత్రం అందజేసి ప్రమాణస్వీకారం చేయించారు. తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న ఎంపీటీసీలతోపాటు పుంగనూరు ఎమ్మెల్యే రామచంద్రారెడ్డికి, పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్‌కు, పలువురు నేతలకు అనసూయమ్మ ధన్యవాదాలు తెలిపారు.



అనసూయమ్మకు ధ్రువీకరణపత్రం అందజేస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి, డీపీఓ సుధాకర్

వైఎస్సార్‌సీపీకి పూర్వ వైభవం

తవణంపల్లె: వైఎస్సార్‌సీపీకి మండలంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా పని చేసి పూర్వవైభవం తీసుకురావాలని పూతలపట్టు నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. రెండవ వైస్ ఎంపీపీ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రానికి సునీల్‌కుమార్ విచ్చేశారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నాయకులతో సమాలోచనల అనంతరం పార్టీ తరఫున రెండవ వైస్ ఎంపీపీగా ఎంపిక చేసిన అభ్యర్థికి బీ–ఫాం అందజేశారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు కలసికట్టుగా చెర్లోపల్లె ఎంపీటీసీ అనసూయమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకోవడంపై సంతోషం వ్యక్తం చేశారు. మండలంలోని పార్టీ నాయకులు సమన్వయంతో పని చేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతనంగా ఎంపికైన రెండవ వైస్ ఎంపీపీ అనసూయమ్మను సత్కరించారు. రెండవ వైస్ ఎంపీపీగా అవకాశం కల్పించి ఏకగ్రీవంగా ఎన్నుకున్న ఎంపీటీసీలకు, ప్రతి ఒక్కరికీ, పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ హరిరెడ్డి, ఎంపీపీ ప్రతాప్ సుందర్‌రాయల్ రెడ్డి, హరికృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ గీతారెడ్డి, ధనంజయరెడ్డి, రవిరెడ్డి, రాజశేఖర్, మధుసూదన్ రెడ్డి, శివాజి రెడ్డి, మణిరాజ్, సుధాకర్, రమేష్ పాల్గొన్నారు.



అనసూయమ్మను అభినందిస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్, పార్టీ నాయకులు

సరిలేరు.. మీకెవ్వరు



నా కొడుకు డాక్టర్.. నా కూతురు ఇంజినీరు.. మా అల్లుడు ఫారిన్‌లో ఉద్యోగం.. మా కోడలు సాఫ్ట్‌వేర్.. అని చెప్పుకోవడం ఆ కుటుంబానికి, బంధువులకు మాత్రమే సంతోషం కలిగిస్తుంది. అదే మా వాడు జవాన్ అని చెప్పుకుంటే కలిగే అనుభూతి మాటల్లో చెప్పలేనిది. ఆ కుటుంబమే కాదు, ఊరు కూడా తలెత్తుకుంటోంది. దేశమంతా చేయెత్తి జైకొడుతుంది. వ్యవసాయమే జీవనాధారమైన పూతలపట్టు నియోజకవర్గం దేశ సేవలో ఏమాత్రం తీసిపోమని చాటుతోంది. ఉద్యోగ విరమణలో ఉన్నవారంతా యుద్ధానికి సై అంటున్నారు. పిలుపు వస్తే రణరంగానికి సిద్ధమని చెప్పారు. ఇటీవల ఇండో..పాక్ యుద్ధ నేపథ్యంలో అత్యధిక మంది దేశసేవలో తరిస్తున్న గ్రామాల గురించి ఓ లుక్కేద్దాం.



యాదమరి మండలంలోని దళవాయిపల్లి గ్రామం

దేశ సేవలో తరిస్తున్న యువత

- సరిహద్దులో పహారా కాస్తున్న పూతలపట్టు వాసులు
- గర్వంగా ఉందంటున్న సైనిక కుటుంబాలు
- మళ్లీ యుద్ధమంటే సిద్ధమే అంటున్న మాజీ సైనికులు

కాణిపాకం: సాంకేతిక యుగంలో యువత సాఫ్ట్‌వేర్ వైపు చూస్తోంది. కొద్దోగొప్పో సంపాదించి జీవితంలో త్వరగా స్థిరపడాలని ఉబలాటపడుతోంది. అయితే పూతలపట్టులోని పలు గ్రామాలకు చెందిన యువకులు దేశ సేవకు అంకితమవుతున్నారు. దేశ రక్షణలో దగ్గరగా ఉంటూ తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. డబ్బుకన్నా దేశ రక్షణకు తమ తొలి ప్రాధాన్యమని చాటి చెబుతున్నారు. ఏ ఇంట చూసినా స్వాతంత్ర్య సమరవీరుల చిత్రపటాలే కనిపిస్తాయి. ప్రతి ఇంటి నుంచి ఒకరిద్దరు భారత సైన్యంలో ఉండటం విశేషం!



ఉగ్రవాద దాడిలో మృతి చెందిన సైనికుడు.. ఎగువ రాగిమానుపెంటకు చెందిన కార్తీక్ మృతదేహం (ఫైల్)

యాదమరి మండలం, దళవాయిపల్లిలో దాదాపు నలభై కుటుంబాల నుంచి 80 మంది వరకు భారత సైన్యంలో పనిచేస్తున్నారు. 30 మంది వరకు దేశ సేవలో అలుపెరగని పోరాటం చేసి ఉద్యోగ విరమణ చెందారు. వయస్సు పైపడినా దేశ భక్తి నరనరాన జీర్ణించుకుపోయి.. ఇప్పటికీ తమలో చేవ తగ్గలేదని చెబుతున్నారు. దేశానికి సేవ చేయడం గర్వకారణమని, అదో గొప్ప అనుభూతి అని అభిప్రాయపడుతున్నారు. దేశానికి సేవ చేసే భాగ్యం రావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. దేశానికి అందించిన సేవ తమతోనే ఆగిపోకూడదనే భావనతో తమ తరువాతి తరం వారిని సైతం భారత సైన్యంలోకి పంపుతున్నారు. యువత కూడా ఉత్సాహంగా అడుగులు వేస్తున్నారు. హవాల్దార్లుగా, నాయక్, లాన్స్ నాయక్, జేసీఓ, సుబేదార్‌గా వివిధ హోదాల్లో దేశ రక్షణలో పాలుపంచుకున్నారు. ఇలా యాదమరిలోని పలు గ్రామాల్లో ఉద్యోగ విరమణ పొందిన, ప్రస్తుతం పనిచేస్తున్న వారు 120 మంది వరకు ఉన్నారు. అలాగే పూతలపట్టు మండలం, చిన్నబండపల్లెలో 75 మంది ఆర్మీ ఉద్యోగులున్నారు. దీంతో పాటు మండల వ్యాప్తంగా వంద మందికిపైగా జవాన్లు ఉంటారని అధికారులు అంచనా వేశారు. అలాగే బంగారుపాళ్యంలో 150 మంది, తవణంపల్లెలో 30 మంది, ఐరాల మండలంలో మాజీ సైనికులతో పాటు 60 మంది ఉన్నారు.

నిద్రలేని రాత్రుల్లో...

తాటిపైకి తీసుకొచ్చిన పదం. ఉగ్రమూకలు చెలరేగుతున్న వేళ.. అమాయకులను పొట్టన పెట్టుకుంటున్న తరుణంలో సైన్యం ఎక్కుపెట్టిన తుపాకీ ప్రతి ఒక్కరిలో దేశభక్తిని రగిల్చింది. మనమంతా గుండెల మీద చేయి వేసుకుని హాయిగా నిద్రపోతున్నామంటే.. సరిహద్దులో సైనికులు నిద్రలేని రాత్రులు గడుపుతుండడంతోనే సాధ్యమవుతోంది. అక్కడ ఏం జరుగుతుందో.. వాళ్లు ఎలా ఉంటున్నారో.. ఆ కుటుంబాల పరిస్థితి ఏమిటో.. కదనరంగం దృశ్యాలను చూస్తుంటే ఒళ్లు గగుర్పొడుస్తుంది. బుల్లెట్ల మోత.. విరుచుకుపడే మిసైళ్లు.. దూసుకొచ్చే డ్రోన్లు.. అత్యాధునిక ఆయుధాలకు ఎదురొడ్డి నిలుస్తున్న సైనికులను చూస్తే కన్నీళ్లతో సెల్యూట్ చేయాలనిపిస్తోంది. సరిహద్దులో ఉద్రిక్తతల వేళ పూతలపట్టులోని పలు గ్రామాలు నిద్రలేని రాత్రులను గడిపాయి.

యుద్ధం మళ్లీ వస్తే నేను రెడీ ..



యుద్ధం మళ్లీ వస్తే 52 ఏళ్ల లోపు ఉన్నవాళ్లను తీసుకుంటారని చెబుతున్నారు. నేనైతే రెడీ. నాకు నా తల్లి ఎంత ముఖ్యమో.. నేను పుట్టిన గడ్డ కూడా అంతే ముఖ్యం . దేశం కోసం వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నా. ఎప్పుడు పిలుపు వచ్చినా వెళ్తా.

-కరుణాకరెడ్డి, ఐరాల

పాక్ కవ్వింపు చర్యలు సరికాదు



పాకిస్తాన్ కవ్వింపు చర్యలకు పాల్పడడం హాస్యాస్పదంగా ఉంది. అత్యాధునిక యుద్ధ సామగ్రితో కంచుకోటగా ఉన్న మన దేశంపై శత్రు దేశాలు దండెత్తినా ఎదుర్కొనే శక్తి సామర్థ్యాలు పుష్కలంగా ఉన్నాయి. మావాళ్లంతా సరిహద్దులో ఉన్నారు. వాళ్లకు కొండంత బలాన్ని ఇవ్వాలని ఆ అమ్మవారిని కోరుకుంటున్నా.

– మొగిలీశ్వరన్, రిటైర్డ్ నాయక్, దళవాయిపల్లె, యాదమరి మండలం

దేశానికి అండగా నిలవాలి



ప్రస్తుత తరుణంలో ప్రతిఒక్కరూ దేశానికి అండగా నిలబడాలి. మా గ్రామం నుంచి యువకులు దేశ రక్షణలో భాగమవ్వడం గర్వంగా ఉంది. దాదాపు ఎనభై మంది యువకులు భారత సైన్యంలో పనిచేస్తున్నారు. మరింత మంది యువకులను కూడా మేము ప్రోత్సాహిస్తున్నాం.

– ఆర్.వెంకటాద్రి, రిటైర్డ్ నాయక్, దళవాయిపల్లె

యుద్ధానికి సిద్ధం



భారతదేశ రక్షణ కోసం యుద్ధానికి సంసిద్ధంగా ఉన్నాం. శత్రుమూకలు ఎటువైపు నుంచి వచ్చినా ఎదుర్కొనేందుకు సరిహద్దుల్లో సిద్ధంగా ఉన్నాం. ఆపరేషన్ సింధూరులో భారంగా పాకిస్తాన్ ఉగ్రమూకలను, వారిని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ సైనికులను ఏ విధంగా అయితే మట్టుబెట్టామో, అదేవిధంగా శత్రువులను ఎదుర్కొనేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా పనిచేస్తాం.

– లోక, ఆర్మీ జవాన్, పాలేరు, బంగారుపాళెం

న్యాయం కోసం అంధుడి పోరాటం

- కలెక్టరేట్ ఎదుట ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న అంధుడు రమేష్

చిత్తూరు కలెక్టరేట్ : మెరిట్ ప్రకారం ఎంపికై నా ఇంటర్వ్యూలో తనకు అన్యాయం చేశారని, తనకు న్యాయం చేయాలని కోరుతూ అంధుడైన రమేష్ ప్లకార్డు చేతబట్టి సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశాడు. ఆయన మాట్లాడుతూ, ఉద్యోగ ఎంపికలో మెరిట్‌లో ఎంపికైన విభిన్న ప్రతిభావంతుడైన తనను వైద్య ఆరోగ్య శాఖ నిరాకరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని ఓ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో పోస్టుమార్టం అసిస్టెంట్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. తాను మెరిట్ ప్రకారం ఎంపికయ్యానని, అయితే ఇంటర్వ్యూ దశలో డీసీహెచ్ఎస్ అధికారులు తనకు కళ్లు కనబడటం లేదనే కారణంతో ఎంపిక ప్రక్రియను రద్దు చేశారన్నారు. దివ్యాంగుల కోటాలో సంబంధిత డిజబులిటీ సర్టిఫికెట్, మెరిట్ ఆధారంగా తనకు ఉద్యోగం రావాల్సి ఉన్నప్పటికీ నిష్కారణంగా తొలగించారని పేర్కొన్నారు. తన సమస్యపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఇంత వరకు న్యాయం చేయలేదని, ఇకనైనా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

వరసిద్ధుని సేవలో జైళ్ల శాఖ డీజీపీ



స్వామి వారి చిత్రపటం అందుకుంటున్న జైళ్ల శాఖ డీజీపీ

కాణిపాకం: కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని సోమవారం రాష్ట్ర జైళ్ల శాఖ డీజీపీ అంజనీకుమార్ తన కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. దర్శనాంతరం ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలికారు. శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో సీఐ శ్రీధర్‌నాయుడు, ఎస్ఐ ధరణీధర, సిబ్బంది చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

జైళ్ల నిర్మాణంలో ప్రభుత్వ నిర్లక్ష్యం

పోలీసు, న్యాయ వ్యవస్థలపై ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి కారణంగా మానవ హక్కులకు భంగం వాటిల్లుతోందనే విమర్శలొస్తున్నాయి. గతంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జిల్లా కారాగారంతో పాటు మొత్తం 10 జైళ్లు ఉండగా ప్రస్తుతం అవి ఆరుకే పరిమితమయ్యాయి. పుత్తూరు, చంద్రగిరి, పలమనేరు, వాల్మీకిపురంలోని జైళ్లు శిథిలావస్థకు చేరడంతో వాటిని తొలగించారు. వాటి స్థానంలో కొత్తవి నిర్మిస్తామని శిలాఫలకాలు వేసిన పాలకులు నిర్మాణ పనులను దశాబ్దాలుగా గాలికి వదిలేశారు.

- పుత్తూరు, చంద్రగిరి, పలమనేరు, వాల్మీకిపురం జైళ్లు మూసివేత
- దశాబ్దాలు గడుస్తున్నా ఊసేలేని కొత్త జైళ్ల నిర్మాణం
- పట్టించుకోని పాలకులు

పుత్తూరు: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మొత్తం 10 జైళ్లు ఉండగా ఇందులో తిరుపతి, మదనపల్లె, పీలేరులోని సబ్‌జైళ్లు మాత్రం స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నిర్మించినవి. మిగిలినవన్నీ బ్రిటీష్ కాలంలో నిర్మించినవే. వీటిలో కొన్ని శిథిలావస్థకు చేరుతుండడంతో వాటి స్థానంలో కొత్తవి నిర్మించాలని భావించిన జైళ్లశాఖ అధికారులు పుత్తూరు, పలమనేరు, వాల్మీకిపురం, చంద్రగిరి సబ్‌జైళ్లను మూసివేశారు. దీంతో ప్రస్తుతం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జైళ్ల సంఖ్య ఆరుకే పరిమితమయ్యాయి. మూసివేసిన పుత్తూరులో సబ్‌జైల్ స్థానంలో నూతన భవన నిర్మాణానికి నందిమంగళం రెవెన్యూ లెక్క దాఖలాలోని సర్వే నంబర్ 242/22లో 2 ఎకరాల భూమిని రాష్ట్ర జైళ్ల శాఖకు స్థానిక రెవెన్యూ శాఖ కేటాయించింది. ఈ మేరకు 2010 జూన్ 18న అప్పటి జైళ్ల శాఖ ఐజీ గోపీనాథ్‌రెడ్డి నూతన జైలు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అయితే అది ఇప్పటివరకూ కార్యరూపం దాల్చలేదు. పలమనేరులోని జైలును సైతం మూసివేసిన అధికారులు ఆ స్థలంలో పెట్రోల్ బంకు నిర్మాణ పనులు ప్రారంభించారు. అలాగే వాల్మీకిపురంలోని జైలును మూసివేసి తిరుపతి–మదనపల్లె మార్గంలో రూ.4 కోట్ల అంచనాతో జైలు నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే ఈ భవన నిర్మాణ పనులు సగానికి పైగా పూర్తయిన తర్వాత అర్థాంతరంగా ఆగిపోయి ఏళ్లు గడుస్తుండడంతో కొత్త భవనం సైతం శిథిలావస్థకు చేరుతోంది. అలాగే చంద్రగిరిలోని కారాగారం శిథిలావస్థకు చేరడంతో దానినీ మూసివేశారు. ఇలా ఉన్న జైళ్లను తొలగించడంతో పుత్తూరు సబ్‌కోర్టు ద్వారా శిక్షలు పడిన ఖైదీలను 70 కిలోమీటర్ల దూరంలోని సత్యవేడు సబ్‌జైలుకు, అలాగే పలమనేరు, వాల్మీకిపురం కోర్టుల్లో శిక్షలు పడిన ఖైదీలను పీలేరులోని సబ్‌జైలుకు తరలిస్తున్నారు. ఇది పోలీసులతో పాటు ఖైదీలకు, వారి కుటుంబీకులకు వ్యయ ప్రయాసలతో కూడుకుంటోంది. అలాగే జైళ్లలోని గదులు చాలక ఖైదీలను ఎక్కువ మందిని ఒకే సెల్‌లో నిర్బంధించాల్సిన పరిస్థితి. ఈ దుస్థితి 15 ఏళ్లుగా ఉంటున్నా పాలకులు పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదు.



వాల్మీకిపురంలో నూతన జైలు భవన నిర్మాణ దుస్థితి

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని జైళ్ల కేంద్రాలు
చిత్తూరు (జిల్లా కారాగారం)
పుత్తూరు
తిరుపతి
పలమనేరు
మదనపల్లె
చంద్రగిరి

మూసివేసిన కేంద్రాలు
పీలేరు
వాల్మీకిపురం
శ్రీకాళహస్తి
సత్యవేడు



పుత్తూరులో జైలు నిర్మాణ స్థలమిదే




చిత్తూరు జిల్లా కారాగారం

ప్రతిపాదనలు పంపించాం

వాల్మీకిపురంలో జైలు నిర్మాణానికి 2012లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రూ.4 కోట్లు మంజూరైంది. తొలిదశలో రూ.2 కోట్లు విడుదల కాగా అంత వరకు పనులు జరిగి ఆగిపోయాయి. ఇటీవలే కొత్త ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాం. పలమనేరులోని జైలును 15 ఏళ్ల క్రితమే మూసివేశారు. 40 సెంట్లు మాత్రమే ఉన్న ఆ స్థలంలో నూతన జైలు నిర్మాణానికి అవకాశం లేదు. ఇక్కడ స్థలాన్ని ఐఓసీ పెట్రోల్ బంకుకు కేటాయించాం. పలమనేరులోనే మరోచోట జైలు నిర్మాణానికి 5 ఎకరాల స్థలం కావాలని జిల్లా కలెక్టర్‌ను నివేదిక సమర్పించాం. అది పరిశీలనలో ఉంది. పుత్తూరులో జైలు నిర్మాణానికి నిధులు మంజూరు కావల్సి ఉంది.

ఖైదీలకు మెరుగైన సేవలు



ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఉన్న జైళ్లలో 306 మంది ఖైదీలు ఉన్నారు. ఒక్క చిత్తూరు జిల్లా కారాగారంలోనే 130 మంది ఖైదీలు ఉన్నారు. ఇక్కడ ఓపెన్ స్కూల్ నడుపుతున్నాం. గత ఏడాది 11 మంది, ఈ ఏడాది ఐదుగురు పదవ తరగతి పరీక్షలు రాసి ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యారు. అన్ని జైళ్లలో స్కిల్ డెవలప్‌మెంట్ స్కీమ్ కింద శిక్షణ ఇస్తున్నాం. శిక్షణ పొందిన వారికి కలెక్టర్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశాం. శిక్షణ పొందిన వారు జైలు నుంచి విడుదల అయ్యాక బ్యాంకు రుణాలు పొంది కొత్త జీవితం ప్రారంభించవచ్చు. రోజూ అన్ని జైళ్లలో ఖైదీలతో యోగా, వ్యాయామం చేయిస్తున్నాం. మహిళా ఖైదీల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. – ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా జైలు అధికారి, చిత్తూరు.

జిల్లాకు రానున్న 6 కుంకీ ఏనుగులు

- నేడు బెంగళూరులో అటవీ అధికారుల సమావేశం
- 21న కర్ణాటకలో కుంకీలను డిప్యూటీ సీఎంకు అప్పగింత?

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో రైతాంగానికి కంటికి కునుకు లేకుండా చేస్తున్న ఏనుగుల కట్టడికి 6 కుంకీ ఏనుగులను రప్పించేందుకు అధికారులు పూనుకున్నారు. దీనిపై తొలుత మంగళవారం బెంగళూరులో నిర్వహించనున్న సమావేశంలో పాల్గొనేందుకు డీఎఫ్ఓ భరణి, ఎఫ్ఆర్వో థామస్ సోమవారం బయల్దేరి వెళ్లారు. 21 న బెంగళూరులో కర్ణాటక ప్రభుత్వం నుంచి 6 కుంకీలను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అందుకుంటారని తెలిసింది. వీటిలో 4 ఏనుగులు పలమనేరుకు, 2 ఏనుగులను కుప్పంకు కేటాయించనున్నట్లు తెలుస్తోంది. వాటిని అటవీ శాఖాధికారులు పలమనేరులోని మొసలిమడుగు వద్ద ఉన్న ఎలిఫెంట్ శిబిరానికి తీసుకురానున్నారు.

క్లుప్తంగా

నియామకం


గోవర్ధన్ నాయుడు

నగరి : రాష్ట్ర పంచాయతీ రాజ్ విభాగం కార్యదర్శిగా విజయపురం మండలం ఎం.అగరం గ్రామానికి చెందిన పి. గోవర్ధన్ నాయుడును నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి సోమవారం నియామక ఉత్తర్వులు అందాయి. తనపై పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, మాజీ మంత్రి ఆర్కేరోజా ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

22న ప్రత్యేక విద్యుత్ అదాలత్

చిత్తూరు కార్పొరేషన్: వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఈనెల 22న గురువారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు. స్థానిక గాంధీరోడ్డులోని డివిజన్ కార్యాలయంలో ఉదయం 11.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. కమిటీ చైర్మన్ విశ్రాంత జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు రామమోహన్, సాంకేతిక సభ్యులు అంజనీకుమార్, స్వతంత్ర సభ్యులు విజయలక్ష్మి హాజరవుతారని, చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల వినియోగదారులు సమస్యలను అదాలత్ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.

'పోలీస్ గ్రీవెన్స్'కు 38 ఫిర్యాదులు

చిత్తూరు అర్బన్: చిత్తూరులోని ఏఆర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో 36 వినతులు అందాయి. ప్రజల నుంచి ఏఎస్పీ రాజశేఖర్ రాజు వినతులు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదునూ ఆన్‌లైన్ చేయడంతో పాటు నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పలు ఫిర్యాదులపై అప్పటికప్పుడే వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఆయా స్టేషన్ హౌస్ అధికారులతో మాట్లాడారు. వీటిలో కుటుంబ తగాదాలు, వేధింపులు, మోసాలు, ఇంటి తగాదాలు, భూ తగాదాలు, ఇతరత్రా లావాదేవీలకు సంబంధించిన సమస్యలున్నాయి. అలాగే చిత్తూరు డీటీసీ రాంబాబు సైతం ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.

ఏపీఈఏపీ సెట్‌కు 76 మంది గైర్హాజరు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి ఏపీఈఏపీ సెట్ అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలను ఉదయం, మధ్యాహ్నం నిర్వహించారు. చిత్తూరు, పలమనేరు పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షలకు 874 మందికిగాను 798 మంది హాజరు, 76 మంది గైర్హాజరయ్యారని అధికారులు తెలిపారు. మొత్తంగా 91.30 శాతం హాజరు నమోదైనట్లు తెలియజేశారు.

భూసార పరీక్ష కేంద్రానికి మరమ్మతులు

- రూ.9లక్షలు మంజూరు



చిత్తూరు రూరల్: చిత్తూరుమామిడికాయల మార్కెట్‌లోని భూసార పరీక్షల కేంద్ర మరమ్మతులకు అధికారులు ఉపక్రమించారు. వచ్చే నెల నుంచి కేంద్రంలో భూసార పరీక్షలు ప్రారంభం చేయాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఈ దిశగా నెలాఖరులోపు పనులు పూర్తి చేయనున్నారు. మట్టి నమూనా సేకరణకు కూడా ఈనెల ఆఖరుతో ముగియనుంది. మరమ్మతులకు ప్రభుత్వం రూ. 9 లక్షలు మంజూరు చేసినట్లు మార్కెటింగ్ శాఖ అధికారులు తెలిపారు.

పత్రం ఎప్పుడిస్తారు సారూ!

'చిత్తూరు అర్బన్‌లో గిరింపేటకు చెందిన రమణమ్మ సొంతింటి కోసం అర్జీ ఇచ్చారు. పీఎంఏవై– 2.0 కింద మంజూరవుతుందని అధికారులు చెప్పడంతో పునాది వరకు సొంత డబ్బులతో నిర్మించారు. అయితే ఇప్పటి వరకు అధికారులు ఇంటి మంజూరు పత్రం ఇవ్వలేదు. ఆందోళనకు గురైన ఆమె నిర్మాణ పనులు ఆపేశారు'.

- మంజూరు కోసం ఎదురు చూస్తున్న లబ్ధిదారులు
- నెలల కాలంగా ప్రదక్షిణలు
- పట్టించుకోని హౌసింగ్ శాఖ అధికారులు



పీఎంఈవై 2.0కు దరఖాస్తులు చేసుకున్న వెబ్‌సైట్ చిత్రం

చిత్తూరు కలెక్టరేట్ : వైఎస్సార్‌సీపీ సర్కారు పాలనలో జిల్లా వ్యాప్తంగా లక్షలాది మందికి సొంతిళ్లు నిర్మించుకునే అవకాశం కల్పించారు. సొంతిళ్లను, ఇళ్ల పట్టాలనూ మంజూరు చేసింది. ఇళ్లు కాదు; ఊళ్లు నిర్మిస్తామని ఇచ్చిన మాటను సైతం ఆచరణలో సాకారం చేసింది. వందలాది లేఔట్లలో ఇళ్లు నిర్మించి ఊర్లకు ఊర్లనే సృష్టించింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పీఎంఏవై 2.0 కింద గృహ నిర్మాణానికి కేంద్రం వాటాలో రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం వాటాలో రూ.లక్ష చొప్పున సాయం అందిస్తామని ప్రకటించింది. మరోవైపు చిత్తూరు జిల్లాలో ఈ పథకానికి వేలాది మంది అర్జీలు ఇచ్చారు. ఇళ్ల మంజూరుకు అధికారులు డీపీఆర్‌లు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించారు. అర్హులంతా ఇళ్ల మంజూరు పత్రం కోసం జనవరి నుంచి అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం మాత్రం ఇప్పటివరకూ రూపాయి కూడా ఇచ్చిన పాపానపోలేదు. హౌసింగ్ శాఖాధికారులు కూడా నోరు మెదపడం లేదు. ఫలితంగా దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులు నిరాశకు లోనవుతున్నారు.

ముందస్తుగా ఆర్భాట సర్వే

జిల్లాలో అర్బన్ ప్రాంతాల్లోని పేదలను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం ఐదు నెలల ముందే ఆర్భాటంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) 2.0 పథకం కింద సర్వే చేసింది. జిల్లాలోని అర్బన్ ప్రాంతాల్లో సొంత స్థలం ఉండి, ఏడాదికి రూ.3 లక్షల ఆదాయం లోపు ఉన్న వారికి పీఎంఏవై 2.0 పథకం మంజూరు చేసే నిమిత్తం సర్వేకు పూనుకుంది. ముందస్తుగా వార్డు సచివాలయ ఉద్యోగులతో డిమాండ్ సర్వే మాత్రం అట్టహాసంగా చేయించినా ఆపై గృహాలు మంజూరు చేయకుండా చేతులెత్తేసింది. ఈ సర్వేలో ఇంటి స్థలం లేని వారు, ఇంటి నివాస స్థలంతోపాటు ఇల్లు మంజూరు చేయాలని మరి కొందరు, పట్టణ ప్రాంతాల్లో సొంత స్థలాలున్నాయని..తమకు హౌసింగ్ స్కీమ్‌లో గృహాలు మంజూరు చేయాలని పలువురు విజ్ఞప్తి చేశారు. ఇలా జిల్లాలో 42,347 దరఖాస్తులు అందాయి. వాటిలో కోతల అనంతరం, కూటమి ప్రజాప్రతినిధులు చెప్పిన వారికి 2,472 మందిని ఎంపిక చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపించారు.

అనుమతుల కోసం నిరీక్షణ

పట్టణ ప్రాంతాల్లో సొంత స్థలం ఉండి, హౌసింగ్ స్కీమ్‌లో మంజూరు చేస్తే ఇల్లు నిర్మించుకుంటామనే ఆసక్తితో 2472 మంది పేదలు దరఖాస్తులు చేసుకున్నారు. అందిన దరఖాస్తులను పరిశీలించిన హౌసింగ్ శాఖ అధికారులు డీపీఆర్ (డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు)ను ప్రభుత్వానికి నివేదించారు. పీఎంఏవై 2.0 పథకానికి జిల్లా వ్యాప్తంగా కార్పొరేషన్, మున్సిపల్ ప్రాంతాల్లో 2,024 డిసెంబర్‌లో దరఖాస్తులు చేసుకున్నారు. నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఇళ్ల మంజూరుపై అతీగతి లేదు. మంజూరు పత్రాలిస్తే పనులు ప్రారంభిస్తామని పలువురు లబ్ధిదారులు నిత్యం హౌసింగ్ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. కొందరైతే బేస్‌మెంట్ వరకు నిర్మించారు. మరోవైపు రుతుపవనాల ప్రభావంతో వర్షాలు మొదలయ్యాయి. వర్షాల కారణంగా ఇబ్బందులు తప్పవని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో పీఎంఏవై 2.0 వివరాలు

నియోజకవర్గం	పీఎంఏవై గృహాల మంజూరు వివరాలు
చిత్తూరు	828
కుప్పం	575
నగరి	516
పలమనేరు	438
పుంగనూరు	115
మొత్తం	2472

కడుపు నొప్పి అని వెళితే.. గర్భం!

- బాలికపై లైంగికదాడి
- ఆలస్యంగా వెలుగులోకి

గుడిపాల: మైనర్ బాలికపై లైంగిక దాడి జరగడంతో ఆమె గర్భం దాల్చిందని గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. మండలం నారగల్లు పంచాయతీలో ఓ దళితవాడకు చెందిన ఓ బాలిక (14) 9వ తరగతి చదువుతోంది. సోమవారం కడుపునొప్పి ఎక్కువగా ఉన్నట్టు తల్లిదండ్రులకు చెప్పడంతో వారు చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడి డాక్టర్లు ఆ బాలిక 3 నెలల గర్భంతో ఉన్నట్టు నిర్ధారించారు. అదే గ్రామానికి దూరపు బంధువైన 50 ఏళ్ల వ్యక్తి ఆ బాలికను వంచించి లైంగిక దాడికి పాల్పడినట్లు ప్రాథమికంగా తేలింది. నిందితుడికి 25 ఏళ్ల కుమారుడు, 18, 16 ఏళ్ల వయసున్న కుమార్తెలు ఉన్నట్టు పోలీసులు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతుడు తిరుపతి వాసి

చిత్తూరు అర్బన్: చిత్తూరులో గత శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయిన వ్యక్తిని పోలీసులు గుర్తించారు. అతడు తిరుపతికి చెందిన మహాలింగం (63) అని తేలింది. అతు చిత్తూరులో రోడ్డు దాటుతుండగా ఓ స్కూటరిస్టు ఢీ కొన్నాడు. చిత్తూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మహాలింగం మృతి చెందాడు. తొలుత ఇతని వివరాలు తెలియలేదు. పోలీసుల విచారణలో మృతుడు తిరుపతిలోని శ్రీనివాసనగర్‌కు చెందిన వాడని గుర్తించారు. ట్రాఫిక్ సీఐ నిత్యబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కన్నీటి సంద్రమే.. ఊరంతా దుఃఖమే

- అశ్రునయనాలతో చిన్నారులకు అంత్యక్రియలు


చితిపై చిన్నారుల మృతదేహాలు

కుప్పం రూరల్: నీటి కుంటలో పడి దుర్మరణం పాలైన ముగ్గురు చిన్నారులకు కుటుంబ సభ్యులు, బంధువులు అశ్రునయనాలతో సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఉదయం 9.30 గంటలకు కుప్పం ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు. 10.30 – 11 గంటల మధ్య మృతదేహాలు దేవరాజపురానికి చేరుకున్నాయి. మృతదేహాలు గ్రామ పొలిమేరల్లోకి చేరగానే ఆర్తనాదాలతో.. "పోయిటియ్యా... కన్నా... ఇనిమే యారికిట్టె పేసిరిదీ... యార్‌కిట్టె వెలియాడిరిదీ..." (వెళ్లిపోయావా కన్నా! ఇకపై ఎవరితో మాట్లాడాలి, ఎవరితో ఆడుకోవాలి?) అంటూ కుటుంబ సభ్యులతో పాటు గ్రామం అంతా కన్నీటి సంద్రమైంది. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల వరకు తమ మధ్యనే ఉన్న అశ్విన్ (7) గౌతమి (6), శాలిని (7)ల మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. సోమవారం మధ్యాహ్నం మృతదేహాలను గ్రామ శ్మశాన వాటికకు తరలిస్తుంటే చిన్నారుల తల్లిదండ్రులు రోదనలు అందరినీ విచలితుల్ని చేశాయి. తీసుకెళ్లొద్దంటూ పిల్లల ముఖాలను ముద్దాడుతూ వారు పడిన వేదన అంతా ఇంతా కాదు. అంత్యక్రియలకు తండోపతండాలుగా హాజరై పిల్లలకు అంతిమ వీడ్కోలు పలికారు.

ఒక్కొక్కరికీ రూ.లక్ష పరిహారం

మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ఒకొక్కరికీ రూ.లక్ష చొప్పున ఆర్థికసాయం చేసింది. ఈ మొత్తాన్ని ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్, ఆర్డీఓ శ్రీనివాసరాజు, డీఎస్పీ పార్థసారథి సోమవారం బాధిత కుటుంబాలకు అందజేశారు.

మితిమీరిన వేగం.. పోయిందో ప్రాణం

- బైక్ అదుపు తప్పి యువకుడు దుర్మరణం


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సందీప్

చౌడేపల్లె: ఎవరబ్బా ఈ యువకుడు..!? ఎంత స్పీడుగా పోతున్నాడో చూడు అని అందరూ అలా చూస్తుండగానే క్షణాల వ్యవధిలో ఆ యువకుడిని ఆ స్పీడే బలిగొంది. సోమవారం ఈ సంఘటన సోమల మండలం ఇరికిపెంట సమీపంలోని చెన్నపట్నం వద్ద చోటుచేసుకుంది. స్థానికుల కథనం.. చౌడేపల్లె మండలం లద్దిగంకు చెందిన సందీప్(25) కోళ్లఫారాల వద్ద కోళ్లను టింపోలకు, లోడింగ్ చేసే పనులకు కూలీగా వెళ్లేవాడు. బైక్‌లో సోమల వద్దకు కూలీ పనుల నిమిత్తం వెళ్లి స్వగ్రామానికి తిరుగుప్రయాణంలో మృత్యువాత పడ్డాడు. వేగంగా వెళ్తూ చెన్నపట్నం చెరువు వద్ద మలుపులో అదుపుతప్పి పడ్డారు. తలకు తీవ్రగాయమైంది. 108లో అతడిని చౌడేపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తల్లిదండ్రుల ఆర్తనాదాలు పలువురిని కలచివేశాయి. సోమల పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరుకు తరలించారు.

పది సప్లిమెంటరీ పరీక్షలకు 416 మంది గైర్హాజరు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా సోమవారం ప్రారంభమైన పది సప్లిమెంటరీ పరీక్షలకు 416 మంది గైర్హాజరైనట్లు డీఈవో వరలక్ష్మి వెల్లడించారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో తొలిరోజు పది సప్లిమెంటరీ పరీక్షకు 1859 మందికిగాను 1443 మంది హాజరయ్యారని చెప్పారు. తాను 3 కేంద్రాలను, ఫ్లైయింగ్ స్క్వాడ్లు 31 కేంద్రాలను తనిఖీ చేసినట్లు చెప్పారు. 36 పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు.

కరెంట్ షాక్‌తో ఒకరి గాయాలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కరెంట్ షాక్‌కు గురై ఓ వ్యక్తికి గాయాలైన సంఘటన సోమవారం చిత్తూరు మండలం తాళంబేడు క్రాస్‌లో చోటు చేసుకుంది. వివరాలు..కొల్‌కత్తాకు చెందిన నారాయణ దేవ్ తాళంబేడు క్రాస్‌లో కాంక్రీట్ పనులు చేస్తున్నాడు. ఈక్రమంలో చేతిలోని కమ్మీ కరెంటు తీగలకు తగిలి ఆ వ్యక్తి కొంత దూరం పడిపోయాడు. అక్కడ పనిచేస్తున్న వారి సాయంతో అతని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎలాంటి ప్రాణపాయం లేదని పోలీసులు చెప్పారు.

స్వీపర్ల పెండింగ్ జీతాల కోసం ఆందోళన


ఆందోళన చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లకు పెండింగ్ జీతాలు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. దీనికి నేతృత్వం వహించిన ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ప్రభుత్వ బడుల్లోని స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలని ఎన్నోసార్లు కోరినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. జిల్లా అధ్యక్షురాలు రాధ మాట్లాడుతూ, 2018 నుంచి 2021 వరకు ఉమ్మడి జిల్లాలోని 350 మంది స్వీపర్లకు 36 నెలల జీతాలు ఇవ్వలేదన్నారు. మిగిలిన కొంత మందికి 18 నెలల జీతాలు ఇచ్చి 14 నెలల వరకు పెండింగ్‌లో పెట్టారన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జయకుమారి, సంఘ సభ్యులు కోకిల, లక్ష్మి, హసీనా, తులసి, రోజా, మమత తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్‌పై కోర్టులో కేసు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ చేస్తుండటంపై ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో కేసు వేశామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుధారాణి తెలిపారు. ఈనెల 14న చిత్తూరులోని భరత్ నగర్‌లో స్కానింగ్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ తనిఖీలో నిబంధనలను ఉల్లంఘించి లింగ నిర్ధారణ చేస్తున్నట్లు ఓ ముఠా గుట్టును రట్టు చేయడం విదితమే. కలెక్టర్ ఆదేశాలతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు విచారణ పూర్తి చేసి పీసీపీఎన్‌డీటీ చట్టం ప్రకారం కేసు వేశారు. డాక్టర్లు కానివాళ్లు లింగ నిర్ధారణ చేస్తున్నారని, కొన్నేళ్లుగా రూ.15వేల ఫీజుతో స్కానింగ్ చేస్తున్నట్లు తేలిందని ఆమె చెప్పారు.

కుప్పంలో తమిళ పోలీసుల హల్‌చల్

- అంతర్రాష్ట్ర దొంగల కోసం గాలింపు
- ఓ వ్యక్తిని పట్టుకుపోయిన వైనం


అలిగిరి అనే వ్యక్తిని తీసుకెళ్తున్న తమిళ పోలీసులు

కుప్పం రూరల్: కుప్పంలో సోమవారం తమిళ పోలీసులు హల్‌చల్ చేశారు. తమిళనాడులోని చెన్నై, కోయంబత్తూరు, ఈరోడ్ తదితర పట్టణాల్లో చోరీలకు పాల్పడిన వ్యక్తుల మూలాలు కుప్పంలో ఉన్నట్లు నిర్ధారించుకుని ఇక్కడ వేట ప్రారంభించారు. పట్టణంలోని మర్రిమానువీధికి చెందిన అలిగిరి అనే వ్యక్తిని అనుమానితునిగా గుర్తించి పట్టుకెళ్లారు.

తమిళ పోలీసుల చూపంతా కుప్పం వైపే..!

తమిళనాడు రాష్ట్రంలో ఏవైనా దొంగతనాలు చోటు చేసుకుంటే అక్కడి పోలీసులు కుప్పం వైపు అనుమానంగా చూడటం కొత్తేమీ కాదు. మూడు దశాబ్దాల క్రితం ఓ తెగకు చెందిన కొన్ని కుటుంబాలు ఇక్కడికి వచ్చి కుప్పం చుట్టుపక్కల స్థిరపడ్డాయి. దొంగతనాలు, దోపిడీలు చేయడమే వారి వృత్తి. స్థానికంగా ఉండటం మూలాన ఇక్కడ మాత్రం దొంగతనాలకు పాల్పడకపోవడం గమనార్హం! అదే తమిళనాడులోని దూర ప్రాంతాలను టార్గెట్ చేసుకుని దొంగతనాలు చేసి కుప్పంలో వచ్చి దాక్కుంటున్నారు. అక్కడ కేసులు నమోదైతే పోలీసులు దొంగల కోసం గాలిస్తూ కుప్పం వస్తారు. ఇప్పటికే పలుమార్లు తమిళ పోలీసులు కుప్పం వచ్చి ఆ తెగకు సంబంధించిన వారిని పట్టుకుని వెళ్లారు కూడా. ఇదే క్రమంలో సోమవారం సైతం వేలూరు ప్రాంతంలో జరిగిన ఓ దొంగతనం దర్యాప్తు కోసం తమిళ పోలీసులు కుప్పం వచ్చారు. 40 తులాల వరకు చోరీ జరిగినట్లు పోలీసులు గుర్తించారు. దొంగతనానికి పాల్పడింది కుప్పంలో నివాసం ఏర్పాటు చేసుకున్న ఆ ప్రత్యేక తెగకు చెందిన మహిళలుగా గుర్తించారు. మర్రిమానువీధికి చెందిన వ్యక్తిని తమ వెంట పట్టుకెళ్లారు.

కూటమి నేతల రాజీయత్నాలు!

ఎప్పుడు తమిళ పోలీసులు కుప్పం వచ్చినా కూటమి నేతలు పోలీసులు, దొంగల నడుమ మధ్యవర్తిత్వం చేస్తూ ప్రతిఫలంగా పెద్దమొత్తంలో పుచ్చుకుంటున్నారనే విమర్శలు మూటకట్టుకుంటున్నారు. దొంగలు సైతం కేసులకు భయపడి వారు అడిగినంత సమర్పిస్తున్నారు. దీంతో ఎప్పుడు తమిళ పోలీసులు కుప్పం వచ్చినా కూటమి నేతల పంట పండినట్లేనని ఇక్కడి ఘటనలు చెబుతున్నాయి.

సారా తయారీ.. అన్నదమ్ముల అరెస్ట్

- నల్లబెల్లం విక్రయించిన రైతు కూడా అరెస్ట్


అరెస్ట్ చేసిన నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

చిత్తూరు అర్బన్: సారా తయారు చేస్తున్న వై.కిషోర్ (36), వై.నవీన్ (41) అనే ఇద్దరు అన్నదమ్ములను చిత్తూరు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అర్బన్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సీఐ శ్రీహరిరెడ్డి కథనం.. గుడిపాల మండలంలో సారా తయారీ ఎక్కువగా ఉందని పోలీసులకు సమాచారం అందడంతో ఆదివారం పాపిశెట్టి గ్రామ పరిసరాల్లో విస్తృత దాడులు చేశారు. ఇక్కడున్న అడవుల్లో సారా కాస్తున్న కిషోర్, నవీన్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 500 లీటర్ల బెల్లపు ఊటలను ధ్వంసం చేశారు. నిందితులకు నల్లబెల్లం విక్రయించాడని కొండేపల్లెకు చెందిన రైతు పెరుమాల్ (54)ను సైతం పోలీసులు అరెస్టు చేశారు. ఇతడి నుంచి 50 కిలోల నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ మోహన్‌కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

- ప్రజాసమస్యల పరిష్కార వేదికలో బాధితుల నివేదన
- అర్జీలు స్వీకరించిన జాయింట్ కలెక్టర్ విద్యాధరి


వినతులు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ విద్యాధరి

ప్రదక్షిణలతో సరి..

న్యాయం అందేది ఎప్పుడో మరి..?

చిత్తూరు కలెక్టరేట్ : న్యాయం చేస్తారనే ఆశతో ప్రతి వారం కలెక్టరేట్ లో అర్జీ ఇస్తున్నాం..ఇంకెన్ని సార్లు తిరగాలి సారూ? అని అర్జీదారులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలు సమస్యలపై అర్జీలు ఇచ్చారు. అర్జీలిస్తున్నా పరిష్కారం కావడం లేదని పలువురు వాపోయారు. జాయింట్ కలెక్టర్ విద్యాధరి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో డీఆర్వో మోహన్‌కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనుపమ, విజయలక్ష్మి, ఆర్డీవో శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

256 అర్జీలు

వివిధ సమస్యలపై 256 అర్జీలు అధికారులకు అందాయి. రెవెన్యూ, సర్వే శాఖకు 198, పోలీసు శాఖ 13, డీఆర్‌డీఏ 11, ట్రాన్స్‌కో 7, ఆర్‌అండ్‌బీ 1, పౌర సరఫరాల శాఖ 7, పశుసంవర్ధక శాఖ 2, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ 4, వాటర్ రిసోర్స్ 4, దేవదాయశాఖ 1, విద్యాశాఖ 2, కలెక్టరేట్ ఏఓ 2, డీసీసీ బ్యాంక్ 1, ఎంపీడీఓ పాలసముద్రం 1, హౌసింగ్ 2 అర్జీలు వచ్చినట్లు కలెక్టరేట్ ఏఓ కులశేఖర్ వెల్లడించారు.

మామిడి చెట్లను జేసీబీతో తొక్కించేశారు

తాము నాటి పెంచిన మామిడి చెట్లను అగ్రకులస్తులు జేసీబీతో తొక్కించి నాశనం చేశారని చౌడేపల్లె మండలం దిగువపల్లె మొట్లపల్లె యానాదులు వరలక్ష్మి, శారద, వెంకటలక్ష్మి కన్నీటి పర్యంతమయ్యారు. తమ గ్రామ పరిధిలో సర్వే నంబర్ 193/5, 193/6 సర్వే నంబర్‌లో 7 ఎకరాల డీకేటీ భూమి ఉందని, ఆ భూమిని చదును చేసి ఐదేళ్ల నుంచి మామిడి మొక్కలు పెంచుతున్నట్టు చెప్పారు. ప్రస్తుతం అగ్ర కులస్తులు వాటిని జేసీబీతో పూర్తిగా నేలమట్టం చేశారని, తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రతి పనికీ రేటు ఫిక్స్..!

– కోసలనగరం సొసైటీ బ్యాంకు ఇన్‌చార్జి సీఈఓ రూటే వేరు


న్యాయం చేయాలని కోరుతున్న కోసలనగరం గ్రామ రైతులు

విజయపురం మండలం కోసలనగరం సొసైటీ బ్యాంకు ఇన్‌చార్జి సీఈఓ బ్యాంకును తన జేబు సంస్థగా మార్చుకుని అక్రమాలకు పాల్పడుతున్నారని బాధితులు వేలు, కుమార్ తదితరులు జేసీకి వినతి పత్రం ఇచ్చారు. రైతుల సంక్షేమానికి ఉద్దేశించిన సొసైటీలో ప్రతి పనికీ ఓ రేటు ఫిక్స్ చేసి ఇన్‌చార్జి సీఈఓ రైతులకు అన్యాయం చేస్తోందని, సొసైటీ బ్యాంకు నిధులను తన సొంత ప్రయోజనాలకు వినియోగించుకుంటోందని ఆరోపించారు. సీఈఓగా అర్హత లేకున్నా దొడ్డిదారిలో ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారన్నారు. బ్యాంకు రుణాలు, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతోందని, తన కుటుంబ సభ్యులకు, కావాల్సిన వారికి మాత్రం రుణాలు మంజూరు చేస్తున్నారని ఆరోపించారు. రైతులతో అమర్యాదకరంగా మాట్లాడుతున్నారని, రిటైర్డ్ సీఈఓ మురుగయ్య, ప్రస్తుత ఇన్‌చార్జి సీఈఓ రాధ రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని, సమగ్ర విచారణ చేసి చేయాలని కోరారు. దీనిపై జేసీ వెంటనే విచారణకు ఆదేశించారు.

గ్రామసభకు విలువ లేదా?


గ్రామసభ తీర్మానానికి విలువ లేదా? అని ప్రశ్నిస్తున్న పాపిరెడ్డిపల్లె ఎంపీటీసీ, సర్పంచ్

కాలువలు నిర్మించాలని గ్రామసభలో తీర్మానిస్తే టీడీపీ నాయకులు అడ్డుకుంటున్నారని జీడీనెల్లూరు మండలం పాపిరెడ్డిపల్లె ఎంపీటీసీ భారతి, సర్పంచ్ పార్థసారథి రెడ్డి జేసీకి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ, తమ గ్రామంలోని ఒక ప్రాంతంలో వర్షపునీరు, మురుగునీరు నిల్వ లేకుండా చేయడానికి కాలువ నిర్మించాలని తీర్మానిస్తే, గ్రామస్తుడు రుషేంద్రరెడ్డి తాను వేలంలో పొందిన గుడిమాన్యం భూమికి సీసీ రోడ్డు వేసుకునేందుకు కాలువ నిర్మించకూడదని అడ్డుపడుతున్నారని, కొందరు కూటమి నాయకులు సైతం ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్నారని నివేదించారు. ఉన్నతాధికారులు న్యాయం చేయాలని కోరారు. బుగ్గపట్నం సర్పంచ్ మునిరాజారెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, గ్రామస్తులు సుధాకర్‌రెడ్డి, రఘునాథరెడ్డి, బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నెలలు గడుస్తున్నా ఇవ్వని సదరం సర్టిఫికెట్


సదరన్ సర్టిఫికెట్ ఇవ్వడం లేదంటున్న దివ్యాంగురాలు నందిని

నెలలు గడుస్తున్నా సదరం సర్టిఫికెట్ ఇవ్వడం లేదని యాదమరి మండలం షికారికాలనీకి చెందిన దివ్యాంగురాలు నందిని వాపోయారు. ఆమె మాట్లాడుతూ, సదరన్ సర్టిఫికెట్‌కు కొన్ని నెలల క్రితం బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి వెళ్లానని చెప్పారు. తల్లిదండ్రులు లేని తనకు జీవనాధారం ఇబ్బందిగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పింఛన్ కోసం అవసరమైన సదరన్ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసుకుని నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఇవ్వలేదని వాపోయారు.